సాక్షి నల్లగొండ

మంగళవారం ¦ 3 ¦ జూన్ ¦ 2025

I



గురితప్పని లక్ష్యం
నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన క్రాంతికుమార్ భారత ఆర్చరీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. - IIలో



షిర్డీ వెళ్లొస్తూ మృత్యు ఒడిలోకి..
షిర్డీ వెళ్లి తిరిగి వస్తుండగా కారులో మంటలు చెలరేగి ప్రభుత్వ ఉపాధ్యాయుడు సజీవ దహనమయ్యాడు. - IIలో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38°/27°
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'రైతు నేస్తం'
నల్లగొండ టౌన్: జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు వేదికల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు విధిగా హాజరు కావాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ద్వారా నాణ్యమైన విత్తనాలు, మినీ కిట్‌లను రైతులకు అందజేస్తారని పేర్కొన్నారు. వానాకాలం పంటల సాగుపై వ్యవసాయాధికారులు తగిన సలహాలు, సూచనలు అందజేస్తారని, ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు
నల్లగొండ: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు అర్హత గల విద్యార్థులు ఈ నెల 21లోగా iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఐటీఐల కన్వీనర్, నల్లగొండ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు విద్యార్థులు నల్లగొండలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక



వీసీ నుంచి పరిశోధన ఆహ్వాన పత్రాన్ని అందుకుంటున్న మారం వెంకటరమణారెడ్డి

నల్లగొండ టూటౌన్ : సింగపూర్ యూనివర్సిటీలో జూలై నెలలో జరుగనున్న అంతర్జాతీయ సదస్సుకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) వాణిజ్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి ఎంపికయ్యారు. ఈ సదస్సులో తన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. సదస్సుకు వెళ్లనున్న వెంకటరమణారెడ్డికి సోమవారం వీసీ ఖాజాఆల్తాఫ్ హుస్సేన్ ఆహ్వాన పత్రం అందజేసి అభినందించారు.

పెట్టుబడిదారి వర్గానికి కేంద్రం వత్తాసు



సభలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

గట్టుప్పల్ : కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారి వర్గానికి వత్తాసుగా ఉంటూ శ్రామిక వర్గాలను అణగదొక్కే కుట్ర చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం గట్టుప్పల్ మండలం వెల్మకన్నెలోని యాదయ్య ప్రాంగణంలో నిర్వహించిన సీపీఐ 2వ మండల మహాసభలో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవి నీతి, అక్రమాలతో ప్రజాధనం దోచుకు తిన్నారని ఆరోపించారు. ప్రజలను పక్కదో పట్టించేందుకే కవిత రోజుకో ప్రకటనతో డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. కారింగు శ్రీను అధ్యక్షతన జరిగిన మహాసభలో నాయకులు తీర్పారు వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, లాలయ్య, చాపల శ్రీనివాస్, భీమనపల్లి రమేష్, చలం పాండురంగారావు, జగన్, గడ్డం నవీన్, కట్ట దశరథ, రాపోలు సత్తయ్య, ధనం జయ, కందాల ముత్యం పాల్గొన్నారు.

నేరాలు, హింసకు వ్యతిరేకంగా పోరాటం
సూర్యాపేట అర్బన్: నేరాలు, హింస, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చింతపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలోని కాంప్లెక్స్‌లో ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బండ్ల రమేష్, వైస్ చైర్మన్ నవిలె నాగయ్య, కన్వీనర్ సారగండ్ల సైదులు, మహిళా పోర్ట్ చైర్మన్ మాదాన స్వప్న, జనరల్ సెక్రటరీ బి.సునీత పాల్గొన్నారు.

త్యాగాలతోనే స్వరాష్ట్రం



జాతీయజెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు

> "వందలాది మంది యువకుల ప్రాణ త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. గత పదేళ్ల పాటు రాష్ట్రంలో దోపిడీ పాలన కొనసాగింది.. ప్రస్తుతం అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగుతోంది."
> – మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- తెలంగాణ ఏర్పాటులో సోనియాగాంధీది సాహసోపేత నిర్ణయం
- ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేశా..
- గత పదేళ్లు దోపిడీ పాలన సాగింది
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకెళ్తున్నాం
- అభివృద్ధిలో నల్లగొండను అగ్రపథాన నిలబెడతాం
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం.. సోనియాగాంధీ సాహసోపేత నిర్ణయం వల్లే తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల సభలో మంత్రి ప్రసంగించారు. తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి ఆమరణ నిరాహార దీక్ష చేశానని గుర్తు చేశారు. నల్లగొండ అంటే నమ్మకానికి ప్రతిరూపం అన్నారు. అభివృద్ధిలో నల్లగొండను అగ్రపథాన నిలుపుతామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. విజన్ డాక్యుమెంట్ భవిష్యత్ భగవద్గీతలా పనిచేయనుందని పేర్కొన్నారు.

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసేలా..
మహాలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జిల్లాలో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో అయిటిపాములలో స్వయం సహాయక మహిళా సంఘాలతో సోలార్ బ్యాటరీ యూనిట్ ఏర్పాటు చేయించామన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద క్యాంటిన్ల నిర్వహణ, పెట్రోలు బంక్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు.



రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా నల్లగొండ పరేడ్ గ్రౌండ్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రైతులకు రుణ విముక్తి..
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే చరిత్రలో నిలిచిపోయేలా జిల్లాలో 2,33,981 మంది రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసి రుణ విముక్తులను చేశామన్నారు. యాసంగి సీజన్‌లో రైతు భరోసా కింద ఎకరానికి రూ.6 వేలు చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందించామన్నారు. ధాన్యం కొనుగోళ్లు, డబ్బుల చెల్లింపుల్లోనూ ఈ సారి ముందున్నామని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రం
సామాజిక న్యాయంలో సైతం తెలంగాణ దేశానికి దిశా నిర్దేశం చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే దేశంలోనే ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. బీసీలకు కూడా 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిందని పేర్కొన్నారు. 4 ఐటీఐలు అభివృద్ధికి రూ.6.77 కోట్లు మంజూరు చేశామన్నారు. రూ.20 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మిస్తున్నామని చెప్పారు. అలాగే బ్రాహ్మణవెల్లెంల, ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తయి ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించామన్నారు. ఈ లిఫ్ట్ ద్వారా 3.61 ఎకరాలకు సాగునీరు.. 200 గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు.

పేద విద్యార్థులు వైద్యవిద్య చదివేలా..
పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేలా నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ వద్ద 37 ఎకరాల్లో నిర్మించిన వైద్య కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభించి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు రూ.వందల కోట్లు మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.



తెలంగాణ తల్లి వేషధారణలో చిన్నారి

సక్సెస్ ఫుల్‌గా 'మిషన్ పరివర్తన్'
శాంతి భద్రతల పరిరక్షణతోపాటు గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన మిషన్ పరివర్తన కార్యక్రమంతోపాటు ఆపరేషన్ చబుత్ర సక్సెస్ ఫుల్‌గా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషిచేస్తున్న జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులందరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

న్యాయ సేవలు ప్రజలకు చేరువ కావాలి



వర్చువల్‌గా ప్రారంభోత్సవంలో పాల్గొన్న హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్, ఇతర జడ్జీలు



నిడమనూరులో కోర్టు భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్
- వర్చువల్‌గా నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

నిడమనూరు : పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరిస్తూనే న్యాయ సేవలను ప్రజలకు చేరువ చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం వర్చువల్ విధానంలో నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి కృషితో నిడమనూరు కోర్టును రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజే ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందించవచ్చన్నారు. అలాగే జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు నిడమనూరులో మాట్లాడుతూ కోర్టు, న్యాయమూర్తి నివాస భవనాలు నిర్మించుకోవడం సంతోషకర విషయమన్నారు. కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా నిడమనూరు కోర్టులో ఇన్‌చార్జి న్యాయమూర్తి పవన్‌కుమార్ మొదటి కేసును పరిశీలించారు. వర్చువల్ విధానంలో న్యాయమూర్తి కె.లక్ష్మణ్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ సుజనాకలిసిరాం తదితరులు హాజరుకాగా నిడమనూరులో కోర్టు భవనం ప్రారంభం కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, న్యాయమూర్తులు సంపూర్ణ ఆనంద్, వేణు, ఎమ్మెల్సీ, నిడమనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంసీ కోటిరెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో అభివృద్ధి పనులు ప్రారంభం
రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కోర్టులో పలు అభివృద్ధి పనులను హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్ సోమవారం హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా కోర్టులో హెల్త్ డిస్పెన్సరీ, రాక్ గార్డెన్, ఎలక్ట్రాన్ వెహికిల్‌ను ఆన్‌లైన్ ద్వారా వర్చువల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు కె.లక్ష్మణ్, బి.విజయ్‌సేన్‌రెడ్డి, కె.సుజన, నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సంపూర్ణ ఆనంద్, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో డిస్పెన్సరీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జిల్లా జడ్జి తదితరులు

సీఎంకు లెటర్ ఇచ్చింది వాస్తవమే
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవి కోసం ముఖ్యమంత్రికి లెటర్ ఇచ్చింది వాస్తవమేనని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. నకిరేకల్‌లో సోమవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనలో భాగంగా సోషల్ ఇంజనీరింగ్ జరగాలని రాహుల్ గాంధీ ముందుకుపోతున్నారని, అందులో భాగంగానే తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కరికి చొప్పున మంత్రి పదవి ఇవ్వాలని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలమంతా పార్టీ హైకమాండ్‌కు, అగ్రనేతలకు, సీఎంకు లెటర్ ఇచ్చామన్నారు. తనకు మంత్రి పదవిపై ఆలోచన గాని ఆసక్తి గాని లేదన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి మంత్రి పదవి కచ్చితంగా కేటాయించాలని సీఎంను కోరుతూ ఇచ్చిన లేఖలో ఏ ఒక్క ఎమ్మెల్యే పేరు సూచించలేదన్నారు.

ప్రజావాణి అర్జీలపై అలసత్వం వద్దు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ప్రజావాణి అర్జీలపై అలసత్వం చూపకుండా వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. 15 మంది ఫిర్యాదుదారులు ఫిర్యాదులను సమర్పించారని తెలిపారు. అర్జీల పురోగతిని కలెక్టరేట్‌లోని ఫిర్యాదుల విభాగానికి వెంటనే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి
డిండి: కొనుగోలు కేంద్రాల్లో తేమ వచ్చిన వరి ధాన్యాన్ని కాంటాలు వేసి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం డిండి మండల కేంద్రంతోపాటు తవక్లాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యం, తూకం చేసిన ధాన్యానికి సంబంధించి అకౌంట్లలో జమ అయ్యే డబ్బుల వివరాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, డీటీసీఎస్ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, సీఈఓలు బాల్‌రెడ్డి, అంతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యాన సాగుకు ఊతం

- ఆయిల్‌పామ్, పండ్లు, కూరగాయలు, పూల సాగు పెంపే లక్ష్యం
- సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేత
- రైతులకూ ప్రోత్సాహకాలు
- కార్యాచరణ సిద్ధం చేసిన ప్రభుత్వం



నల్లగొండ అగ్రికల్చర్: ఉద్యాన పంటల సాగుకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా 2025-26 ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన వన పంటల సాగు విస్తీర్ణం పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలైన ఆయిల్‌పామ్, పండ్లు, కూరగాలయలు, పూల తోటల సాగుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలకు చెందిన రైతులకు ప్రోత్సాహకాలు ఇస్తూనే సబ్సిడీలు కూడా అందజేయాలని నిర్ణయించింది.

ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణ పథకం
ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణ పథకం కింద ఉద్యాన పంటల సాగును ప్రోత్సాహించాలనే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ, సూక్ష్మ నీటిపారుదల పథకం సమన్వయంతో ఈ ఏడాది జిల్లాలో 6,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేయాలని నిర్ణయించింది. ఇందుకు గాను పతంజలి ఫుడ్స్ కంపెనీ ద్వారా లబ్ధిదారులకు మొక్కలను సరఫరా చేసి రైతుల వ్యవసాయ భూముల్లో నాటించనున్నారు. నాటిన మొక్కల పెంపకానికి గాను సబ్సిడీపై రైతులకు డ్రిప్ (బిందు, తుంపర సేద్యం) పరికరాలు అందించనున్నారు.

రాష్ట్ర సూక్ష్మ నీటిపారుదల పథకం కింద..
రాష్ట్ర సూక్ష్మ నీటిపారుదల పథకం కింద ఆయిల్‌పామ్‌తోపాటు పండ్లు, కూరగాయలు, మిరప తోటల సాగుకు బిందు, తుంపర సేద్యం పరికరాలను అందించనున్నారు. ఇందుకు ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీ, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించనున్నారు.

అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి
> "రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద పండ్ల తోటలు, ఇతర కూరగాయల సాగును ప్రోత్సహించడానికి సబ్సిడీ అందజేయాలని నిర్ణయించింది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. లాభదాయకంగా మారిన తోటలు, కూరగాయలు సాగుపై రైతులు దృష్టి సారించాలి."
> – పి.అనంతరెడ్డి, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి

సమగ్ర ఉద్యాన అభివృద్ధికి..
జిల్లాలో పండ్లు, పూల తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా బొప్పాయి, అరటి, అల్లనేరేడు, సీతాఫలం, మామిడి, నిమ్మ, జామ, బత్తాయి, పంటలు, పూల సాగుకు 40 శాతం రాయితీ అందజేయనున్నారు. వంగ, టమాట, పచ్చిమిర్చి, కూరగాయల నారును సరఫరా చేయనున్నారు. పాలీ, గ్రీన్‌హౌస్ నిర్మాణానికి మల్చింగ్ పద్ధతిలో సాగుకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. సమగ్ర తెగుళ్ల నిర్మూలన, సమీకృత పోషక నిర్వహణ రైతులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. వర్మి కంపోస్టు యూనిట్ ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. అలాగే రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద శాశ్వత పందిరి పద్ధతిలో తీగ జాతి కూరగాయల సాగు ప్రోత్సహించేందుకు జిల్లాలో 300 యూనిట్లకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఇంకా రాష్ట్రీయ వెదురు మిషన్ కింద వెదురు మొక్కల సాగు ప్రోత్సహించడానికి ఎకరానికి 50 శాతం సబ్సిడీపై రూ.14,400 అందించనున్నారు. అలాగే మల్బరీ తోటల పెంపకానికి కూడా సబ్సిడీ ఇవ్వనున్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటాలి
మిర్యాలగూడ : రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.అంజయ్య, అధ్యక్షుడు డాక్టర్ టి.ప్రశాంత్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-11, 13, 15, 17, 19 విభాగాల క్రీడాకారులకు రెండు రోజుల నుంచి పోటీలు కొనసాగుతున్నాయి. దీంట్లో భాగంగా సోమవారం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయిలో టోర్నీకి ఎంపిక చేసి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు త్వరలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుబాబు, కార్యదర్శి పి.నవీన్‌కుమార్, సెలక్షన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శ్రీనివాస్, జిల్లా కోచ్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

క్లుప్తంగా

చోరీ జరిగిన ఏటీఎంను పరిశీలించిన ఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలో చోరీ జరిగిన ఎస్‌బీఐ ఏటీఎంను సోమవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దొంగతనం జరిగిన తీరు, కేసు దర్యాప్తు వివరాలను సీఐ చరమంద రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలోకి సీసీ కెమెరాలు పరిశీలించి చోరీకి పాల్పడిన వారిని వెంటనే గుర్తించాలని పోలీసులకు సూచించారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత నెల బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి ఏటీఎంలు, బ్యాంకుల వద్ద సెక్యూరిటీని, సీసీ కెమెరాలను బలోపేతం చేసుకోవాలని సూచించినట్లు గుర్తుచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నార్కట్‌పల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం పామనగుండ్ల గ్రామానికి చెందిన చెరుకు మహేష్(24) ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లిలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. కూరగాయలు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా.. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని చైతన్య ఆస్పత్రి ఎదుట మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో మహేష్ పక్కనే ఉన్న డివైడర్‌కు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడు మృతి

మోత్కూరు: ఆటో ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం కమ్మగూడేనికి చెందిన తిప్పబత్తిని రాజయ్య(63) సోమవారం పాటిమట్ల గ్రామంలోని స్కూల్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా.. మోత్కూరు నుంచి వస్తున్న ఆటో పల్టీ కొట్టి రాజయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని భువనగిరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

చెన్నాయిపాలెం విద్యార్థికి 238వ ర్యాంకు


భూక్యా కోటేష్

మఠంపల్లి: మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన భూక్యా రవీందర్, సీతమ్మ దంపతుల కుమారుడు కోటేష్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 238వ ర్యాంకు సాధించాడు. మారుమూల గిరిజన తండాకు చెందిన కోటేష్ అత్యుత్తమ ర్యాంకు సాధించడంతో గ్రామ పెద్దలు అభినందించారు.


నల్లగొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నల్లగొండలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రదర్శించిన గృహ నిర్మాణ శాఖ శకటం


స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి


నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నల్లగొండలో వ్యవసాయ శాఖ స్టాల్‌లో రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు


నల్లగొండలో రవాణా శాఖ శకటం ముందు పరేడ్ నిర్వహిస్తున్న ఆ శాఖ అధికారులు


సూర్యాపేటలో నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న శాసనమండలి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


సూర్యాపేట కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


సూర్యాపేటలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గురితప్పని లక్ష్యం

- భారత ఆర్చరీ జట్టు కోచ్‌గా పుట్టపాక వాసి క్రాంతికుమార్
- చిన్నప్పుడే అతడిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన తల్లిదండ్రులు

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన దేప విప్లవరెడ్డి, రాజ్యం దంపతుల కుమారుడు కాంత్రికుమార్ భారత ఆర్చరీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. చిన్నప్పుడే క్రాంతికుమార్‌లోని ప్రతిభను గుర్తించిన అతడి తల్లిదండ్రులు 4వ తరగతిలోనే హైదరాబాద్‌లోని హకీంపేటలో గల తెలంగాణ స్పోర్ట్స్ పాఠశాలలో చేర్పించారు. అక్కడ పనిచేస్తున్న ఆర్చరీ కోచ్ డాక్టర్ రవిశేఖర్ ప్రోత్సాహంతో క్రాంతికుమార్ ఆర్చరీ క్రీడలో పట్టు సాధించారు. అక్కడే బీఏ పూర్తిచేసి, హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో పీజీ పూర్తిచేశారు. ఆ తర్వాత కలకత్తాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో ఆర్చరీ కోచ్‌గా డిప్లొమా పూర్తిచేశారు. 2024లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఆర్చరీ కోచ్‌గా ఉద్యోగం రావడంతో హర్యానాలోని సోనిపట్ల ప్రాంతంలో కోచ్‌గా ఉద్యోగంలో చేరారు. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ ఆర్చరీ జట్టు కోచ్ ఎంపికలో పాల్గొని ఈ నెల 15 నుంచి 20 వరకు సింగపూర్‌లో జరిగే ఆసియా కప్‌లో భారత ఆర్చరీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. క్రాంతికుమార్‌కు ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అరవింద్, కోశాధికారి సత్యప్రసాద్, నల్ల గొండ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తునిక విజయసాగర్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కామినేని, మాజీ ప్రధాన కార్యదర్శి ఈగ సంజీవరెడ్డి, కోశాధికారి పుట్ట శంకరయ్య అభినందనలు తెలిపారు.


హర్యానాలో క్రీడాకారుడికి శిక్షణ ఇస్తున్న క్రాంతికుమార్

నిరంతరం ప్రోత్సహించారు

నాలోని ప్రతిభను చిన్నప్పుడే నా తల్లిండ్రడులు గుర్తించి స్పోర్ట్స్ పాఠశాలలో చేర్పించారు. నా గురువు డాక్టర్ రవిశేఖర్ నన్ను ఎంతో ప్రోత్సహించారు. రవిశేఖర్ సార్, నా తల్లిందండ్రుల ప్రోత్సాహమే నేను జాతీయ జట్టు కోచ్‌గా ఎంపికవ్వడానికి దోహదపడింది. భారత్ జట్టు విజయం సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతా.

– దేప క్రాంతికుమార్

నాణ్యమైన విత్తనాలతో దిగుబడి పెంచుకోవచ్చు

హుజూర్‌నగర్: నాణ్యమైన విత్తనాలు వాడటం వల్ల దిగుబడిని పెంచుకోవచ్చని ఏరువాక కేంద్రం నల్లగొండ జిల్లా శాస్త్రవేత్త రాజా మధుశేఖర్ అన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఎంసీ చైర్‌పర్సన్ రాధికాఅరుణ్‌కుమార్ అధ్యక్షతన 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజా మధుశేఖర్ పాల్గొని మాట్లాడుతూ.. విత్తనాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. నాణ్యమైన విత్తనాలు వాడితే పది నుంచి పదిహేను శాతం దిగుబడులు పెంచుకోవచ్చని ఆయన సూచించారు. అనంతరం రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఏఓ స్వర్ణ, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ పాల్గొన్నారు.


విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్

షిర్డీ వెళ్లొస్తూ మృత్యు ఒడిలోకి..

- కారులో మంటలు చెలరేగడంతో సజీవ దహనమైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు


సురేష్ (ఫైల్)

నల్లగొండ, మాడ్గులపల్లి: షిర్డీ వెళ్లి తిరిగి వస్తుండగా కారులో మంటలు చెలరేగి ప్రభుత్వ ఉపాధ్యాయుడు సజీవ దహనమయ్యాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని ఏచూరి గార్డెన్స్ సమీపంలో నివాసముంటున్న పెంటపల్లి సురేష్‌కుమార్ (48) తన స్నేహితుడితో కలిసి కారులో షిర్డీకి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆదివారం తెల్లవారుజామున మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లా వద్దకు రాగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్‌తో పాటు సురేష్‌కుమార్ స్నేహితుడు క్షేమంగా బయటపడగా.. సురేష్‌కుమార్ మాత్రం మంటల్లో కాలి సజీవ దహనమయ్యాడు. సురేష్‌కుమార్ నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అతడి భార్య జ్యోతి వైద్యశాఖలో ఎక్స్‌రే టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరు ఇద్దరు డాక్టర్లే కాగా.. కుమార్తె వివాహం అయ్యింది. సురేష్ నల్లగొండలో ఉంటుండగా.. జ్యోతి తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. సురేష్ అంత్యక్రియలు సోమవారం నల్లగొండలో నిర్వహించారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

- కుమారుడు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు


జీవన్ (ఫైల్)

మర్కూక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములర్తి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ములుగు ఎస్‌ఐ దామోదర్ కథనం మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కొండారెడ్డిచెరువు గ్రామానికి చెందిన కర్రె కనకయ్య (33), కుమారుడు కర్రె జీవన్ (13) ఇద్దరూ వ్యాపారం నిమిత్తం కూరగాయలు కొనుగోలు చేసేందుకు బైక్‌పై ములుగు మండలంలోని వంటిమామిడి మార్కెట్‌కు వచ్చారు. కూరగాయలు కొనుగోలు చేసుకొని తిరిగి వెళ్తుండగా మండలంలోని పాములపర్తి గ్రామ శివారులో ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే జీవన్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కనకయ్యను మెరుగైన వైద్యం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


హైదరాబాద్‌లో సోమవారం మాజీ మంత్రి హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, రాంచంద్రనాయక్, బండా నరేందర్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు. హరీష్‌రావు బర్త్ డే మంగళవారం కాగా.. నాయకులు ఆయనకు ముందస్తుగానే పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలకు చెందిన జి. తేజశ్రీ 1505వ ర్యాంకు, సీహెచ్. హన్షిత శ్రీ 2040, జె. మేఘన 2146, టి. అమూల్య 4877, బి.లాస్య 5766, డి. జగదీష్‌రాజు 8076 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఆయా కేటగిరీల్లో 13 మంది విద్యార్థులు ఐఐటీలతో పాటు జాతీయ స్థాయి కళాశాలల్లో సీట్లు సాధించే అవకాశం ఉందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.


జి. తేజశ్రీ


సీహెచ్. హన్షితశ్రీ


జె. మేఘన


టి.అమూల్య


బి.లాస్య


డి.జగదీష్‌రాజు

సత్తా చాటిన సర్వేల్ గురుకుల విద్యార్థులు

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటారు. ఎస్సీ విభాగంలో కొంగరి నిరంజన్ 1668వ ర్యాంకు సాధించాడు. ఆదేవిధంగా తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో పి. లోకేశ్వర్ 2604వ ర్యాంకు సాధించాడు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రవేశ పరీక్షలో బి. అభినంద్‌రెడ్డి, జి. హర్షిత్‌గుప్తా, ఎస్. సుమిత్, కె. బాలు అర్హత సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సతీష్‌కుమార్ అభినందించారు.


కొంగరి నిరంజన్

'ప్రగతి' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

నల్లగొండ: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన రమావత్ కృష్ణ 480వ ర్యాంకు, ధనావత్ చరణ్ 1569, దోమలపల్లి చరణ్ 2960, కల్లేపల్లి సమీరా 4122 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు నరేంద్రబాబు, శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందించారు.


రమావత్ కృష్ణ


ధనావత్ చరణ్


దోమలపల్లి చరణ్


కల్లేపల్లి సమీరా

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ


ఉత్తర మాడ వీధిలో భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ముఖ మండపం క్యూలైన్, క్యూకాంప్లెక్స్, మాడ వీధులు, ధర్మదర్శనం క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. ధర్మదర్శనానికి 3 గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. 35వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రూ.43,72,183 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

చేపల చెరువులో విష ప్రయోగం

- సుమారు 5 టన్నుల చేపలు మృతి
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు

చిలుకూరు: గుర్తుతెలియని వ్యక్తులు చేపల చెరువులో క్రిమిసంహారక మందు కలపడంతో చేపలు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం చిలుకూరు మండలం సీత్లాతండా గ్రామంలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సీత్లాతండా గ్రామానికి చెందిన బానోతు కృష్ణ మూడేళ్ల క్రితం ఉపాధి హామీ పథకంలో తన సొంత పొలంలో 25 గుంటల భూమిలో చేపల చెరువు తవ్వించాడు. ప్రస్తుతం ఆ చెరువులో చేపల పెంపకం చేపట్టాడు. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ చేపల చెరువులో క్రిమిసంహారక మందు కలపడంతో చేపలు మృతిచెందాయి. సోమవారం ఉదయం కృష్ణ చెరువు వద్దకు వెళ్లగా చేపలు మృతిచెంది నీటిపై తేలియాడటం గమనించాడు. ఒక్కో చేప రెండు కిలోల పైనే ఉంటుందని, సుమారు 5 టన్నుల చేపలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. చెరువు ఏర్పాటుకు, చేపల పెంపకం కోసం చాలా డబ్బులు ఖర్చు చేశానని, తనను కావాలనే ఆర్థికంగా దెబ్బతీసేందుకు ఈ పనిచేశారని వాపోయాడు. ఈ ఘటనపై చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు కృష్ణ గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్‌గా పోటీచేశాడు.